# ఐఏఎస్ శ్రీలక్ష్మి.. సీబీఐ కోర్టుకు వెళ్లాల్సిందే

- విచారణను ఎదుర్కోవాల్సిందే
- పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు



**విశ్వంభర, హైదరాబాద్:** ఓఎంసీ కేసులో నిందితురాలైన ఐఏఎస్ అధికారి వై.శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసు నుంచి తప్పించాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సీబీఐ అభియోగాలపై సీబీఐ కోర్టులోనే విచారణ ఎదుర్కొని నిరూపించుకోవాలని పేర్కొంది. ఓబుళాపురం మైనింగ్ అక్రమాల కేసులో డిశ్చార్జి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టివేయడంతో శ్రీలక్ష్మి హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం తీర్పు వెలువరించారు. సీబీఐ ఆరోపణల్లో ప్రాథమిక ఆధారాలున్నందున కేసును కొట్టివేయలేమన్నారు. 68.5 హెక్టార్లు, 39.5 హెక్టార్లకు సంబంధించిన లీజుల మంజూరులో ఓఎంసీకి లబ్ధి చేకూర్చేలా తీసుకున్నారనే నిర్ణయాలు చట్టపరిధిలో జరిగాయా లేదా అనేది ఆ కోర్టులో తేల్చుకోవాలన్నారు. శాతవాహన ఇస్పాత్, జింపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల దరఖాస్తులను తిరస్కరించడం, క్యాప్టివ్ మైనింగ్ పదాన్ని జీవోలో విస్మరించడం వంటివి చట్ట పరిధిలోనే ఉన్నాయని నిరూపించుకోవాల్సిన బాధ్యత పిటిషనర్‌పైనే ఉందన్నారు. రివిజన్ పిటిషన్‌లో పిటిషనర్ లేవనెత్తిన అంశాలను పరిశీలించలేమన్నారు. మాజీ కార్యదర్శి కృపానందం, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలపై కేసును సీబీఐ కోర్టు కొట్టివేసిందనే కారణంతో ఇక్కడ పిటిషన్‌ను అనుమతించలేమన్నారు. ఈ కేసులో సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించారు.

### మళ్లీ సీబీఐ కోర్టుకు..

ఓఎంసీ కేసులో నిందితులైన గాలి జనార్దన్‌రెడ్డి, బి.వి.శ్రీనివాసరెడ్డి, గనుల శాఖ మాజీ డైరెక్టర్ వి.డి.రాజగోపాల్, గాలి వ్యక్తిగత సహాయకుడు అలీఖాన్‌కు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ సీబీఐ కోర్టు తీర్పు వెలువరించగా, హైకోర్టు ఆ శిక్ష అమలును నిలిపివేసిన విషయం విదితమే. మిగిలిన నిందితుల విచారణ పూర్తయినందున శ్రీలక్ష్మి పాత్రపై మరోసారి విచారణ చేపట్టాల్సి ఉంది. ఆమెపై కేసును నిరూపించడానికి అవసరమైన సాక్షులను పిలిపించి వాంగ్మూలాలు నమోదు చేయడంతోపాటు క్రాస్ ఎగ్జామినేషన్ చేయాల్సి ఉంటుంది. అయితే హైకోర్టు తీర్పుపై శ్రీలక్ష్మి సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశమూ ఉంది.

### విఫల యత్నాలు..

ఓబుళాపురం మైనింగ్ కేసు నుంచి బయట పడటానికి శ్రీలక్ష్మి చేయని ప్రయత్నాలు లేవు. సీబీఐ కేసును కొట్టివేయాలని కోరుతూ మొదట హైకోర్టులో పిటిషన్ వేశారు. ప్రాథమిక ఆధారాలున్నందున కేసును కొట్టివేయలేమని హైకోర్టు తిరస్కరించింది. అక్రమ మైనింగ్ వరకే దర్యాప్తు చేపట్టాలంటూ సీబీఐకి హైకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఓబుళాపురం గనుల సరిహద్దు వివాదం సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున అది తేలేదాకా విచారణ నిలిపి వేయాలంటూ మరో పిటిషన్ దాఖలు చేయగా హైకోర్టు దానిని కూడా కొట్టివేసింది.
దీంతో మళ్లీ సీబీఐ కోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టు దానిని కొట్టివేయడంతో హైకోర్టులో రివిజన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు శ్రీలక్ష్మిపై కేసును కొట్టివేయడంతో.. సీబీఐ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.
తిరిగి ఇరుపక్షాల వాదనలను విని తేల్చాలంటూ సుప్రీం కోర్టు ఈ కేసును మళ్లీ హైకోర్టుకే పంపింది.
దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టగా ఆమె తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో సీఆర్‌పీసీ సెక్షన్ 482 కింద శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి కొట్టివేసినందున అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పిటిషన్ విచారణలో ఉండగా శ్రీలక్ష్మి ఇద్దరు న్యాయవాదులను మార్చి చివరికి సీనియర్ న్యాయవాది కె.వివేక్‌రెడ్డికి అప్పగించారు.



## బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకి పాలచర్ల గ్రామంలో సన్మాన సభ

**విశ్వంభర, రాప్తాడు** : రాప్తాడు మండలం పాలచర్ల గ్రామంలో మండల పరిషత్ పాఠశాల నందు పనిచేస్తున్న ఉపాధ్యాయులకి, పాలచర్ల గ్రామస్తులు, సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులకు బదిలీలు జరుగుతుంటాయని, ఇక్కడ ఉపాధ్యాయులు మా పిల్లలకు ఎంతో విద్యాబుద్ధులు నేర్పించారు మరొక చోటికి బదిలీతో వెళ్తున్న ఉపాధ్యాయులు ఇంతకంటే మెరుగైన విద్యను అందించి ఉత్తమ ఉపాధ్యాయులుగా పేరు తెచ్చుకోవాలని గ్రామస్తులు కోరారు. ఉపాధ్యాయులకు పూల మాలలు వేసి శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు మండలం ఎస్సీ సెల్ కన్వీనర్ పాలచర్ల ముత్యాలప్ప, బొంత రామ్మోహన్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గవ్వల నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ పవన్, గంజే రాము వడ్డే గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరపు కొండన్న కి ఘన నివాళి



**విశ్వంభర, రామగిరి :** రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో ఎమ్మెల్యే పరిటాల సునీత తండ్రి కీ శే ధర్మవరపు కొండన్న వర్ధంతి సందర్భంగా ఆయనకి, వెంకటాపురం గ్రామంలోని కొండన్న ఘాట్ దగ్గర ఎమ్మెల్యే పరిటాల సునీత , కుటుంబ సభ్యులు, రాప్తాడు మండలం ఇన్చార్జ్ ధర్మవరపు మురళి, తెలుగుదేశం నాయకులు, శ్రేయోభిలాషులతొ కలిసి ఘనంగా నివాళులు అర్పించారు.
అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించటం తో పాటు పాఠశాలలో విద్యార్థులకు సామాగ్రి కిట్, (పెన్సిల్స్, వాటర్ బాటిల్స్ , బుక్స్, మొదలగునవి) అందజేసి, యల్లమ్మ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బిఆర్ఎస్వి నాయకులు వర్కుషాప్ లో పాల్గొనండి

**- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**




**విశ్వంభర, కల్వకుర్తి :** ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ లోని విఎన్ఆర్ గార్డెన్ బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో బి ఆర్ ఎస్ వి రాష్ట్ర స్థాయి వర్కుషాప్ జరుగుతుంది అని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ,కవి, గాయకుడు ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ,మాజీ మంత్రి జగదీష్ రెడ్డి లు హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొని బిఆర్ఎస్ వి నాయకులకు మార్గదర్శకత్వం ఇవ్వనున్నారు.

## అఖిల భారత 10వ జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలి



**విశ్వంభర, హైదరాబాద్ :** బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో మేమెంతో మాకాంతా వాటా దక్కాలని, దేశవ్యాప్తంగా తక్షణమే బిసి కులగణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7వ తేదీన గోవా రాష్టంలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన అఖిల భారత 10వ జాతీయ ఓబిసి మహాసభను విజయవంతం చేయాలని బిసి యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు దీనికి సంబంధించిన కరపత్రాలు, గోడపత్రికలను శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్లో బీసీ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు బీసీ యువజన సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ గారి పిలుపు మేరకు నేడు నల్గొండ జిల్లా కేంద్రంలో జాతీయ ఓబీసీ 10వ మహాసభ గోడపత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించడం జరిగిందన్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ గారికి పంపించిన ఆర్డినెన్స్ ను గవర్నర్ బీసీలపై సానుకూల దృక్పథం తో నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా కేంద్రప్రభుత్వం బీసీ ఆర్డినెన్స్ బిల్లు ఆమోదం పొందిన తక్షణమే పార్లమెంట్లో ప్రవేశపెట్టి 9 వ షెడ్యుల్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశ జనాభాలో 60 శాతంకు పైగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు లేకపోవడంతో విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం దక్కక శాసించే స్థాయిలో ఉన్న బీసీలు యాచించే స్థాయికి దిగజారారన్నారు. తక్షణమే దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించి బీసీల జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యోగ ఆర్థిక రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు విశ్వనాధుల శివకుమార్, బీసీ యువజన సంఘం నాయకులు జిల్లేపల్లి సాయి, చింతకాయల మురళి, వినయ్, చైతన్య, బి.రాజు, అనిల్ కుమార్, కె. సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**రాప్తాడు మండలం పాలచర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల ఇంచార్జ్ ధర్మవరపు మురళి సూచనల మేరకు, పాలచర్ల గ్రామంలో కందులు,రైతులకి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధికారులు, రాప్తాడు మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పాలచర్ల ముత్యా లప్ప,బొంత రామ్మోహన్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గవ్వల నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ పవన్, గంజే రాము, వడ్డే గోవిందు తదితరులు పాల్గొన్నారు.**
**- విశ్వంభర, రాప్తాడు**



## మలబార్ గోల్డ్, డైమండ్స్ లో 26 నుంచి "బ్రైడల్ జ్యువెలరీ షో"

**విశ్వంభర, బషీర్ బాగ్ :** బంగారు నగల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్, డైమండ్స్, తమ "బ్రైడల్ జ్యువెలరీ షో"ని మలబార్ గోల్డ్ డైమండ్స్ సోమాజిగూడ షోరూంలో వినియోదారుల చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ "బ్రైడల్ జ్యువెలరీ షో 26 జులై నుండి 10 ఆగష్టు, 2025 వరకు కొనసాగుతుందనీ డిప్యూటీ స్టోర్ హెడ్ గోరఖ్నాథ్, షబ్బీర్ లు తెలిపారు. ఈ ప్రచారానికి ఎంపిక చేసిన ఇతివృత్తం ఈ ఇతివృత్తం ద్వారా భిన్న ప్రాంతాలు, విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నవ వధువుల కోసం కళాత్మకంగా రూపొందించిన ఆభరణాలు ప్రదర్శించబడతాయనీ పేర్కొన్నారు.నేటి సంప్రదాయాలకు అనుగుణంగా వధువు కోసం మలబార్ గోల్డ్, డైమండ్స్ ఒక సరికొత్త ధోరణి నెలకొల్పిందన్నారు. తన వివాహం తనకెప్పటికీ సుమధురమని భావించేలా సందేశంతో ముందుకు వచ్చిందన్నారు. భారతీయ వారసత్వ ఆభరణాలు,హస్తకళారూపాల ఆభరణాల బ్రాండ్ 'డివైన్', వజ్రాభరణాల బ్రాండ్ 'మైన్', అన్ కట్ వజ్రాభరణాల బ్రాండ్ 'ఎరా' వంటివి ఉన్నాయని తెలిపారు .ఈ "బ్రైడల్ జ్యువెలరీ షో" సందర్భంగా ప్రతి కొనుగోలు పై ప్రత్యేక ఆఫర్లను, బంగారు ఆభరణాల, రత్నాభరణాల తరుగు చార్జీలపై ఫ్లాట్ 30 శాతం తగ్గింపు, వజ్రాభరణాల వజ్రాల విలువపై 30 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

## గ్రంథాలయ పుస్తకాల అందజేత



**విశ్వంభర, నల్లగొండ** : మండలంలోని వివిధ పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు ఉచితంగా అందించడం అభినందనీయమని మండల విద్యాధికారిణి వల్లపట్ల పద్మ అన్నారు. శుక్రవారం చిన్నమాదారం ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులకు రచయిత, ఆంగ్ల ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన బంతిపూలు, బహుమతి వంటి పిల్లల కథల పుస్తకాలతో పాటు ఊగుతున్న ఉయ్యాల బాల గేయాల పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో గ్రంథాలయాలను సరైన పద్ధతిలో నిర్వహించాలని, పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థులలో పఠనాశక్తి పెరగడమే కాకుండా లోకజ్ఞానం వస్తుందని అన్నారు. రచయిత బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కథల పుస్తకాలు చదివించడం వల్ల విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరగడమే కాకుండా, నైతిక విలువలు, సమయస్ఫూర్తి, సృజనాత్మకమైన భావాలు ఏర్పడగలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి లక్ష్మీనారాయణ, రిసోర్స్ పర్సన్ శ్రీరాములు , అలివేలు, ఏమి రెడ్డి సైదిరెడ్డి, నరసింహ, నలుపరాజు వెంకటేశం వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు పుస్తకాల పంపిణీ



**విశ్వంభర, బషీర్ బాగ్:** గిరిజన శక్తి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ జన్మదిన సందర్భంగా హైదరాబాద్ లో గిరిజన శక్తి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ ఆధ్వర్యంలో కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు 200 మందికి కరెంట్ అఫైర్స్ పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఆయన వెల్లడించారు. పెద్ద ఎత్తున ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకటేష్ చౌహాన్ మాట్లాడుతూ కష్టపడి 30 ఏళ్లు ఒక కార్యకర్త స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎదిగి నిరంతరం తను నమ్మిన వారి కోసం కష్టపడి పనిచేసే వ్యక్తిత్వం ఉన్న నాయకుడు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. అదేవిధంగా గిరిజన ప్రజల కోసం, గిరిజన ప్రజల హక్కుల కోసం ఏ సమస్య వచ్చినా అండగా నిలబడే ఉంటారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు రామదాసు నాయక్ వ్యక్తిగత సిబ్బంది వినోద్ నాయక్, గిరిజన శక్తి రాష్ట్ర నాయకులు శింబు నాయక్, ఆర్.రాజశేఖర్, వినోద్ నాయక్, గ్రేటర్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షులు జేడీ నాయక్, సతీష్ కొండపల్లి, రమేష్, వినోద్, రవీందర్, కృష్ణ, రూప, సంధ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలి

**తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య**




**విశ్వంభర, హనుమకొండ** : రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ ఐక్యతను కూడా పెట్టి మేనేజ్మెంట్ , ప్రభుత్వ సహకారంతో అసోసియేషన్ ప్రతినిధులతో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం బాలసముద్రంలోనీ విద్యుత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22న హైదరాబాదులోని బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్రంలో ఉన్న మిగతా అసోసియేషన్ల కంటే భిన్నంగా తమ అసోసియేషన్ ను మరింత అభివృద్ధి పరుస్తానని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ల పనితీరు మారాల్సిన పరిస్థితి ఉందన్నారు. భారత రాజ్యాంగం రచించిన అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు అందాల్సిన హక్కులను కాలరాస్తూ ఈరోజు వరకు కూడా పదోన్నతులు పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 1977లో అమలు చేసిన ఎస్సీ ఎస్టీ జీవో ప్రకారం విద్యాశాఖలో చదువులో వెనుకబడినందుకే ఉద్యోగాలు వచ్చినప్పటికీ పైసలు చదవడానికి రెండు సంవత్సరాల వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని జీవో నెంబర్ 342లో తెలిపారు. దురదృష్టవశాత్తు గత పది సంవత్సరాల నుండి ఈ జీవో ని అమలు పరచాలని ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సెక్రటరీగా కొనసాగుతూ ప్రజాప్రతినిధులకు ఉన్నతాధికారుల సృష్టికి తీసుకెళ్లినా అమ్ములకు నోచుకోలేదని ఆరోపించారు. ఈ విషయంపై ప్రస్తుత సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ జీవోను అమలు చేస్తే ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు అందరూ చదువుకునే అవకాశం ఉంటుందని ఆ దిశగా తన కార్యసిద్ధిని నెరవేర్చుకునేందుకు మొదటి కర్తవ్యంగా తాను ముందడి పోరాడుతానని భీమవరం చేశారు. రాష్ట్రంలో చాలా సమస్యలు పెండింగ్ ఉన్నాయని రోల్ ఆఫ్ రిజర్వేషన్ రాష్ట్రంలో ఉన్న నాలుగు ఎలక్ట్రిసిటీ సంస్థల్లో అమలు కాకపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. దీనికి సంబంధించిన 2006లో జీవో కన్వర్షన్ కి సంబంధించి అమలు అయితే రాష్ట్రంలో ఉన్న చాలామంది ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. దశలవారీగా తమ సంఘాన్ని మరింత బలోపేతం చేసి రాజ్యాంగం కల్పించిన హక్కులను పూర్తిస్థాయిలో అమలుపరిచే విధంగా మేనేజ్మెంట్ పైన, ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొచ్చి సాధించుకునే దిశగా తమ సంఘం తరపున పోరాడుతామని ధీమా వ్యక్తం చేశారు.

## కళారత్న కేవీ సత్యనారాయణకి ఆటా ఘన సన్మానం



**విశ్వంభర, హైదరాబాద్:** అమెరికా తెలుగు సంఘం(ఆటా) డల్లాస్ నగరంలో ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ నాట్యకళాకారుడు 'కలారత్న కేవీ సత్యనారయణని కళా రంగానికి నాట్య రంగానికి చేస్తున్నసేవలకు అభినందిస్తూ ఘనంగా సత్కరించింది.తొలుత ఈ కార్యక్రమాన్ని సంయుక్త కార్యదర్శి శారద సింగిరెడ్డి నిర్వహణలో ప్రారంభమైనది. ఆటా ప్రసిడెంట్ ఎలెక్ట్ సతీష్ రెడ్డి స్వాగతం పలుకుతూ కేవీ సత్యనారాయణ గారికి ఆటా తో ఉన్న అనుబంధాన్ని ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ ప్రసంగించడమైనది. తర్వాత తానా పూర్వ అధ్యక్షులు శ్రీ తోటకూర ప్రసాద్ కేవీ సత్యనారాయణ చిన్నతనం నుండి ఇప్పటివరకు సాధించిన విజయాలు సన్మానాలు సత్కారాలు వారి కళా ప్రదర్శన గూర్చి వివరముగా తెలియజేస్తూ ప్రసంగించి, కేవీ సత్యనారాయణని అభినందించడమైనది.ఆటా సన్మాన పత్రమును ఆటా ప్రెసిడెంట్ ఎలెక్ట్ సతీష్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శారద సింగిరెడ్డి మరియు బోర్డ్ ఆఫ్ ట్రస్టీ రఘువీర్ మరిపెద్ది, ఆటా కార్యవర్గ బృంద సభ్యులు కేవీ సత్యనారాయణ గారికి బహుకరించడమైనది. తదనంతరం కేవీ సత్యనారాయణ గారు తనకు జరిగిన సన్మానానికి ఆట బృందానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తన జీవితంలో జరిగిన ముఖ్య ఘటనలను,గురువులతో ఉన్న సంబంధాన్ని, పెద్దల ఆశీస్సులను, సినీ జీవితం గురించి మాట్లాడమైనది. కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా యువత ప్రదర్శించిన సంగీత నాట్యాలు నిలిచాయి. నెల నెలా తెలుగు వెన్నెల సాహిత్య సభ వార్షికోత్సవములో కేవీ సత్యనారయణ గారు ప్రదర్శించిన కాలార్చనకు ప్రేక్షకులనుంచి విశేష ప్రశంసలు లభించాయి. ఆటా సభ్యులు గోలి బుచ్చిరెడ్డి, రామ్ అన్నాడి, శ్రీకాంత్ జొన్నల,శ్రీనివాస్ రెడ్డి కేలం, మాధవి మెంట, సుమన బీరం, నీరజ పడిగెల, సుమ ముప్పాల, హరిత కేలం, మరియు ఇతర సంఘ ప్రముఖులు పురిమిండి నరసింహా రెడ్డి, చిన సత్యం వీరనపు తదితరులు పాల్గొన్నారు. ఆటా ప్రెసిడెంట్ ఎలెక్ట్ సతీష్‌రెడ్డి గారు రెండు తెలుగు రాష్ట్రాల్లో 2025 డిసెంబర్ మాసములో జరగబోయే ఆటా సహాయ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల గురించి మాట్లాడుతూ ఆటా వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారిని అహ్వానించారు. నాట్యకళకు సేవచేసె వ్యక్తులకు యిటువంటి గౌరవాలు కొనసాగలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ముగించారు

## చిరు వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించాలి



**విశ్వంభర, వనస్థలిపురం :** రైతు బజార్ తోపుడు బండ్ల, చిరు వ్యాపారస్తుల సమస్యలను పరిష్కరించాలి శుక్రవారం వనస్థలిపురం రైతు బజార్ చిరు వ్యాపారస్తుల తోపుడు బండ్లు కార్మిక సంఘం CITU సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సీఐగా నూతనంగా ఎన్నికైన మహేష్ గౌడ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేయడం జరిగింది ఈ సందర్భంగా వనస్థలిపురం రైతు బజార్ తోపుడుబండ్ల చిరు వ్యాపారస్తులు వారి సమస్యలు పరిష్కరించాలని సిఐ గారికి విజ్ఞప్తి చేశారు సిఐటియు ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య CITU. ఎల్బీనగర్ సర్కిల్ అధ్యక్షులు రామస్వామి మాట్లాడుతూ వనస్థలిపురం రైతు బజార్ పడక ముందు నుంచి గత 40 సంవత్సరాల నుండి రైతు బజార్ ముందు. చిరు వ్యాపారలు చేస్తూ దాదాపుగా 130 అట్టడుగు పేద కుటుంబాలు చిరు వ్యాపారాలను నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారు. CITU ట్రేడ్ యూనియన్ సహకారంతో కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్చార్జి ఎక్స్ ఎంపీ మధుయాష్కి గారి సహకారంతో తోపుడు బండ్లు పెట్టించడం జరిగింది. కొంతమంది వారి జీవనం పైన దెబ్బతీయటానికి ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బంది కాకుండా ఈ వ్యాపారం కొనసాగిస్తున్నాము. కొంతమంది బయట నుండి వచ్చి మా బండ్ల ముందు చిరువ్యాపారం చేస్తున్నారు అందువల్ల ట్రాఫిక్ ఇబ్బంది అవుతుంది. ట్రాఫిక్ ఇబ్బంది అవుతుంది.కలగకుండా చిరు వ్యాపారాలు కొనసాగిస్తామని అన్నారు. మరియు మేము అందరం ఐక్యంగా ఒక యూనియన్ ఏర్పాటు చేసుకున్నాము. ఆ యూనియన్ ద్వారా ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా వ్యాపారం కొనసాగిస్తామని. తెలియజేశారు.యూనియన్ చేసిన నిర్ణయానికి కార్మికులందరం కట్టుబడి ఉంటామని తీర్మానం చేసుకోవడం జరిగింది. ఈ తీర్మానికి వ్యతిరేకంగా తోపుడుబండ్ల కార్మికులు ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే వారి పైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సిఐ గారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు వరలక్ష్మి సహాయ కార్యదర్శి జయమ్మ. చిన్న ఝాన్సీ. నిర్మల మంజు.భారతి.అర్జున్.ఋషి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.